సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం ı 30 ı జనవరి ı 2023



ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా కడప

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా కడప, రన్నర్‌గా వైజాగ్ జట్లు నిలిచాయి. -8లో..



మిస్సింగ్ మొబైల్స్.. ట్రేసింగ్ అదుర్స్

పోయిన మొబైల్‌ఫోన్‌లను కనిపెట్టేందుకు పోలీసులు ఏర్పాటు చేసిన (మొబైల్ మిస్సింగ్ ట్రాకింగ్ సిస్టమ్) సత్ఫలితాలిస్తోంది. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.5/15.1

జిల్లాలో ఆదివారం 15.1- 31.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

మార్పు.. తప్పనిసరి!

- ఇక హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు లేకుంటే చర్యలు
- 8 ఏళ్ల నుంచి కొత్త నంబర్ ప్లేట్ల విధానం
- పాత వాహనాలకు సైతం బిగించేందుకు ప్రణాళిక
- ఆన్‌లైన్ ద్వారా పొందే వెసులుబాటు
- ప్రైవేట్ ఏజెన్సీకి ప్లేట్ల తయారీ బాధ్యత



హై సెక్యూరిటీ నంబరు ప్లేట్



కడప వైఎస్ఆర్ సర్కిల్: వాహనాల భద్రతే ప్రామాణికంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పాత, కొత్త వాహనాలన్న భేదం లేకుండా ప్రతి వాటికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించేందుకు ప్రణాళికగాబద్ధంగా వ్యవహరించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించింది. ఫలితంగా వాహనం ఏదైనా అగ్ని ప్రమాదంలో కాలిపోయినా, ధ్వంసమైనా ప్లేటులో పొందుపర్చిన లేజర్ కోడ్ ద్వారా పూర్తి సమాచారం తెలుసుకునే వెసులుబాటు కలుగుతుంది. అంతేగాక సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడిన వారిని పసిగట్టేందుకు సులువుగా ఉంటుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్క వాహనదారుడు హై సెక్యూరిటీ ప్లేట్లను పొందేలా చైతన్యం తీసుకురావాలని రవాణా శాఖను ఆదేశించింది. అందుకు అనుగుణంగా ఈ శాఖ చర్యలు ముమ్మరం చేసింది. వాహనదారులకు ఇప్పటికే అవగాహన కల్పిస్తోంది. అప్పటికి మారకపోతే జరిమానా విధించేందుకు సైతం సన్నద్ధమవుతున్నారు.

ఆన్‌లైన్‌లోనూ పొందే వీలు ...

ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకునే వాహనాలకు ఆయా షోరూంలలో నంబరు ప్లేట్లు అందుబాటులో ఉంటున్నాయి. పాత వాహనాల యజమానులు పొందాలంటే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. 2019 నుంచి వాహనాల నంబరు ప్లేట్లను ఆయా షోరూంలకే పంపిస్తున్నారు. అక్కడ రిజిస్ట్రేషన్ అయిన ప్రతి వాహనం నంబరు ప్లేటును బిగించుకోవాల్సి ఉంది. పాత వాహనాలకు సంబంధించి హై సెక్యూరిటీ నంబరు ప్లేటు కోసం వెబ్‌సైట్ htt pr//a pta-c-i-t-ize n.e pr-a-fa-th-i.-o-r-fను అందుబాటులో ఉంచారు. ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి నంబరు ప్లేటుకు స్లాట్‌లో బుక్ చేసుకోవచ్చు. క్యూ ఆర్ కోడ్‌ను స్కానింగ్ చేస్తే లింకు వస్తుంది.

అమల్లోకి వచ్చిందెప్పుడంటే..

ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు బిగించాలని 2013లో అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మరుసటి సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చింది. ప్లేట్ల తయారీ బాధ్యతను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పింది. 2014 కంటే ముందు ఉన్న వాహనాలకు కూడా తప్పనిసరిగా ప్లేట్లు అమర్చుకోవాల్సి ఉంది. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. దీంతో వాహనదారులు సైతం నంబరు ప్లేట్ల విషయం మర్చిపోయారు. తమ అభిరుచికి తగ్గట్టుగా స్టిక్కరు బోర్డులు వేయించుకొని తిరుగుతున్నారు.

ధరలు ఇలా...

హై సెక్యూరిటీ నంబరు ప్లేటు కోసం ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లకు రూ. 245, మూడు చక్రాల వాహనాలకు రూ.282, కార్లు, తేలికపాటి మోటారు వాహనాలకు రూ.619, భారీ మోటారు వాహనాలకు రూ.649గా నిర్ణయించారు.

జిల్లాలో ఇలా...

జిల్లా వ్యాప్తంగా 9,97,898 వాహనాలు ఉండగా అందులో నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు 8,94,184, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు 1,03, 714 ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు కనీసం 50 శాతం మంది కూడా బిగించుకోలేదని సమాచారం. హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు అమర్చుకోవడానికి ఈ ఏడాది డిసెంబరు వరకు గడువు విధించారు. ఆ తర్వాత కూడా ప్రక్రియ కొనసాగనుంది. అయితే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని రవాణాశాఖ ఆదేశించింది. వారంతట వారే ప్లేట్లు బిగించుకునేలా చైతన్యం తీసుకురావాలని సూచించింది. ఈ ప్లేట్ వల్ల తమకేమీ ప్రయోజనం లేదని డబ్బులు దండగంటూ ప్రజల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు సైతం ఆచీతూచీ వ్యవహరిస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్నాం



ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు బిగించుకునేలా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. పాత వాహనాలు సైతం సులువుగా బోర్డు పొందేందుకు వీలుగా ఆన్‌లైన్ సదుపాయం కల్పించాం. బోర్డు తయారీ ప్రైవేట్ సంస్థ చూసుకుంటోంది. ప్రభుత్వం నుంచీ వచ్చిన ఆదేశాల మేరకు ప్రతి వాహనానికి ప్లేట్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం.

-ఇ. మీరా ప్రసాద్, జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్

రాజు వెడలె.. రవితేజములలరగ..



విద్యుద్దీప కాంతుల్లో మెరుస్తున్న ఆలయం వద్ద అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామివారు

అశ్వవాహనంపై కడపరాయుడి శోభ

కడప కల్చరల్ : దుష్ట సంహారం చేసేందుకు ఆయన ఖడ్గం చేతబూనాడు. ఉత్తమ అశ్వంపై ఉరకలేస్తున్న సమరోత్సాహంతో వేటకు బయలుదేరాడు. ఆ వీర గంభీర రూపం శత్రువులకు చూడగానే దడపుట్టించేలా ఉంది. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామిని సర్వభూపాల వాహనంలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు మచ్చాశేషాచార్యులు, కృష్ణమోహన్, తివిక్రమ్, కృష్ణమూర్తి, పార్థసారథి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊయల సేవను నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామిని ఊయలలో ఉంచి శయనింపు గీతాలను ఆలపించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గీతాలాపనలు చేశారు. రాత్రి అశ్వవాహనంపై స్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఆ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పూజా ద్రవ్యాలు సమర్పించారు.





సర్వభూపాల వాహనంపై కడప రాయుని గ్రామోత్సవం, కళాకారుల కోలాట ప్రదర్శనలు

గండికోటలో కమలహాసన్



బ్రిటిషు అధికారి వేషంలో నటుడు



అభిమానులకు అభివాదం చేస్తున్న కమలహాసన్

జమ్మలమడుగు: గండికోటలో భారతీయుడు-2 షూటింగ్ కోసం ప్రముఖ నటుడు కమలహాసన్ పర్యాటక కేంద్రమైన గండికోటకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం సినిమా షూటింగ్‌లో పాల్గొంటారని ప్రచారం జరగడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, అభిమానులు తరలివచ్చారు. ఈసందర్భంగా అభిమానులకు ఆయన అభివాదం చేశారు.గండికోటలో వారం రోజుల పాటు దర్శకుడు శంకర్ ఆధ్వర్యంలో షూటింగ్ జరగనుంది. షూటింగ్ కోసం బ్రిటిషు కాలం నాటి పరిస్థితులకు అనుగుణంగా పురాతన వాహనాలు తీసుకురావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. నటులు బ్రిటిషు వారి వేషాల్లో చుట్టుపక్కల సంచరిస్తుండటంతో ప్రజలు వారితో ఫోటోల కోసం ఎగబడ్డారు.

కడప, చెన్నై గ్యాంగుల ఆట కట్టిస్తాం

- బెంగళూరు కేంద్రంగా కడప గ్యాంగ్ స్మగ్లింగ్
- ఇంటి దొంగలపైనా నిఘా ఉంచాం
- మదనపల్లెలో డైనమిక్ చెక్‌పోస్టు
- డీఎఫ్‌ఓ పళణి వివేక్



ప్రకృతి అధ్యయన కేంద్రం వద్ద మానస సరోవరం పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ వివేక్

బి.కొత్తకోట: ఎర్ర చందనం అక్రమ రవాణాలో కడప, చెన్నైకి చెందిన మూడు గ్యాంగులు కీలకంగా పనిచేస్తున్నాయని, వీరి ఆట కట్టించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామని రాజంపేట డీఎఫ్‌ఓ పళణి వివేక్ తెలిపారు. ఆదివారం ఆయన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై అటవీ సముదాయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు, చిన్నచిన్న దొంగలపై ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం ఉండదని, స్మగ్లింగ్ సూత్రధారుల ఆట కట్టిస్తే అక్రమ రవాణా అరికట్టే అవకాశం ఉందన్నారు. కడపకు చెందిన ఓ ప్రధాన స్మగ్లర్, అతని సోదరులు, కుటుంబీకులు బెంగళూరు కేంద్రంగా ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తున్నారన్నారు. అలాగే చెన్నైకి చెందిన రెండు గ్యాంగులు స్మగ్లింగ్ కార్యకలాపాలు జోరుగా సాగిస్తున్నాయని చెప్పారు. వీటిని అణచివేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాజంపేట, కడప నుంచి బెంగళూరుకు, అక్కడి నుంచి చెన్నైకు ఎర్ర చందనం తరలిస్తున్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. స్మగ్లింగ్ అడ్డుకునేందుకు రాయచోటిలో రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. స్మగ్లింగ్ నిరోధానికి అవసరమైన అటవీ సిబ్బందిని పెంచుతామని తెలిపారు. జిల్లాలో 8 చోట్ల చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ఏ చెక్‌పోస్టులో సిబ్బంది ఎలా విధులు నిర్వహిస్తున్నారు, వాహనాల తనిఖీ సక్రమంగా చేస్తున్నారా లేదా, తనిఖీ చేయకుండానే వాహనాలను పంపేస్తున్నారా అని పరిశీలన చేస్తున్నామని చెప్పారు. కర్ణాటక సరిహద్దు ఎక్కువగా ఉండటంతో నిఘా తగ్గిందని, మదనపల్లెలో డైనమిక్ చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తామని చెప్పారు. బాలాయపల్లె చెక్‌పోస్టును మదనపల్లె-కర్ణాటక సరిహద్దుకు తరలిస్తామన్నారు. ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు సహకరిస్తున్న ఇంటి దొంగలపై ఇప్పటికే నిఘా ఉంచామని, ఎవరెవరు సహకరిస్తున్నారో వివరాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని 8 రేంజిల పరిధిలో మొక్కల పెంపకం పనులు పూర్తి చేశామన్నారు. ఒక్కో రేంజిలో 35 హెక్టార్లలో మొక్కలు నాటామన్నారు. ఎస్ఆర్ పాళెంలో నగర వనం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.02 కోట్ల నిధులు మంజూరు చేసిందని, వీటి పనులు చేపట్టనున్నట్టు వివరించారు.

హార్సిలీహిల్స్‌పై ఫ్లోటింగ్ రెస్టారెంట్

బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై అటవీశాఖ ప్రాంగణంలోని మానస సరోవరంలో ఫ్లోటింగ్ రెస్టారెంట్ (తేలియాడే రెస్టారెంట్) ను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ రాజంపేట డివిజనల్ అధికారి పళణి వివేక్ తెలిపారు. ఆదివారం ఆయన హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. అటవీశాఖ అతిథి గృహాలను పరిశీలించి వాటి ఆధునికీకరణకు చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. వీటిని పర్యాటకులకు అందుబాటులో ఉంచుతూ బుక్ చేసుకునేందుకు అనువుగా ఆన్‌లైన్ చేస్తున్నట్టు చెప్పారు. వీటికి అదనంగా మరో అతిథి గృహాన్ని నిర్మిస్తామని చెప్పారు. ప్రకృతి అధ్యయన కేంద్రంలో ఎడ్యుకేషన్-నేచర్ క్లబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రూ.15లక్షలతో అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేపడతామన్నారు. ఆయన వెంట ఎఫ్ఆర్‌ఓ మదన్‌మోహన్, సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ ఉన్నారు.

న్యూస్‌రీల్

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 9.30 గంటలకు కడప జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుంది. ఈ విషయాన్ని సీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ విజయరామరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని చెప్పారు. అందువల్ల జెడ్పీ సభ్యులు ఎమావేశానికి హాజరు కావాలని కోరారు. అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

1న క్రికెట్ క్రీడాకారుల కోసం టాలెంట్ హంట్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఫిబ్రవరి 1వ తేదీన క్రికెట్ క్రీడాకారుల కోసం టాలెంట్ హంట్ నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్, క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్ తెలిపారు. అండర్-12, 14, 16, 19 వయోగ్రూప్‌లో బౌలింగ్ విభాగంలో ఇప్పటి వరకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించని క్రీడాకారులు ఈ టాలెంట్‌హంట్‌కు హాజరుకావాలని సూచించారు. ఇందులో ఎంపికైన బౌలర్లకు సీనియర్ ఐపీఎల్ క్రీడాకారులచే ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను 905200433 నంబర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీలలో స్మార్ట్ సేవలు

- అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు
- సూపర్‌వైజర్లు, కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని ప్రీ ప్రైమరీ విద్యను అందించే అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఈ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తోంది. ఈ సేవలు సక్రమంగా అందేలా చూసి అక్రమాలకు చెక్ పెట్టేందుకు స్త్రీ శిశు సంక్షేమశాఖ స్మార్ట్ సేవలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 2,389 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, అందులో 1,22,037 మంది చిన్నారులు, గర్భిణులు 17660, బాలింతలు 17,318 మంది లబ్ధి పొందుతున్నారు. వీరికి అందించే పౌష్టికాహారం, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు, అక్రమాలకు తావు లేకుండా ప్రత్యేక యాప్‌లు రూపొందించారు. యాప్‌ల నిర్వహణకు జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 85 మంది సూపర్‌వైజర్లు, 2293 మంది అంగన్వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లు అందజేశారు.

పారదర్శక సేవలకు యాప్‌లు

అంగన్‌వాడీ కేంద్రాలకు స్మార్ట్ ఫోన్లతో పారదర్శక సేవలు అందనున్నాయి. ఇప్పటికే రెండు యాప్‌లు అందుబాటులోకి రాగా, మరో నాలుగు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.శానిటేషన్ యాప్‌లో పరిసరాల పరిశుభ్రత వివరాలు నమోదు చేయాలి. పారిశుధ్యం లోపిస్తే వెంటనే ఆ యాప్‌లో వివరాలు నమోదు చేస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శికి సమాచారం వెళుతుంది. వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని పారిశుధ్య పనులు చేపడతారు.

- అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన నిర్వహణకు హాట్ కుక్ యాప్ అందుబాటులోకి రానుంది. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే యాప్‌లో వివరాలు నమోదవుతాయి.
- గ్రామ సచివాలయాల మహిళా పోలీసు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తారు.మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించని కేంద్రం వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు.చిన్నారులు, గర్భిణులు, బాలింతలు మరుగుదొడ్లు వినియోగించుకునేందుకు నీరు అందుబాటులో ఉంచాలి. లేనిపక్షంలో యాప్‌లో వివరాలను నమోదు చేస్తే ఆ సమాచారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చేరుతుంది. ఆ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు.గుడ్ల సరఫరాకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి రానుంది. ఆయా కేంద్రాలకు గుడ్ల ఏజెన్సీలు సక్రమంగా సరఫరా చేస్తున్నాయా? సైజు, నెలవారి కోటా, స్టాకింగ్, గుడ్ల నాణ్యత తదితర వివరాలను యాప్‌లో నమోదు చేయాలి.

పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు మధ్యాహ్న భోజనం, కోడిగుడ్లు, పాలు, బాలామృతం, అటుకులు, రాగి, జొన్న పిండి, ఖర్జూరం, బెల్లం చిక్కీలతో కూడిన కిట్లను సరఫరా చేస్తున్నారు.పౌష్టికాహారం పకడ్బందీగా పంపిణీ చేసేందుకు రెండు ప్రత్యేక యాప్‌లు రూపొందిస్తున్నారు. పోషణ ట్రాకర్ యాప్‌లో రోజూ చిన్నారులు, బాలింతలు, గర్భిణుల హాజరు నమోదు చేస్తున్నారు. చిన్నారుల ఎత్తు, బరువు, కొలతలు కూడా అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం, పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి తదితర వివరాలను పొందుపరుస్తున్నారు. కేంద్రాలకు సరఫరా అయిన పౌష్టికాహారం, గుడ్లు, పాలు తదితర స్టాకు వివరాలు, నెలవారీ రిపోర్టులు అందులో నమోదు చేయాల్సి ఉంటుంది.

అన్ని వివరాలు నమోదు చేస్తున్నాం



ప్రభుత్వం అందజేసిన స్మార్ట్ ఫోన్లలో సెంటర్‌కు సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేస్తున్నాం. యాప్‌లకు సంబంధించి అధికారులు శిక్షణ ఇచ్చారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల హాజరు, పౌష్టికాహారం నెలవారి రిపోర్టులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాం.

– ఎలిజిబెత్ రాణి, అంగన్వాడీ కార్యకర్త, కడప

యాప్‌లపై శిక్షణ ఇచ్చాం



జిల్లాలోని 2389 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు స్మార్ట్ ఫోన్లను అందజేశాం. కార్యకర్తలు పోషణ ట్రాకర్, వైఎస్సార్ సంపూర్ణపోషణ యాప్‌లను వినియోగిస్తున్నారు. వీటిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇచ్చిన పాలు, గుడ్లు, భోజనం తదితర అంశాలను నమోదు చేస్తున్నారు. యాప్‌లపై శిక్షణ ఇచ్చాం.

– ఎంఎస్ రాణి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్, కడప

కోనరాజుపల్లె వద్ద వెలుగు చూసిన శాసనం



కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా కోనరాజుపల్లె సమీపంలోగల అడవిలో శాసనం వెలుగు చూసింది. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా అధికారి కె.ప్రసాద్, ఒంటిమిట్ట అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌తో కలిసి ఈ శాసనాన్ని గుర్తించారు. కేంద్ర పురావస్తుశాఖ ఎపిగ్రఫీ విభాగం డైరెక్టర్ ఆచార్య మునిరత్నంరెడ్డి దీనిని పరిశీలించారు. తెలుగుభాషలో ఉన్న శాసనం 1572 జూన్ 12 బుధవారం నాడు వేసినట్లు అందులో పొందుపరిచారన్నారు. కోనరాజుపల్లెలోని శ్రీరామ ఆలయంలో ప్రసాద వితరణ కోసం భూమిని స్వాధీనం చేసిన వివరాలు ఇందులో ఉన్నాయని, మహామండలేశ్వర మాదిరాజు నాగరామోజ దేవ మహారాజు ఈ శాసనాన్ని వేయించినట్లు తెలుస్తోందన్నారు. శాసనం బండకు రెండు వైపుల అక్షరాలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో పోలీసు అధికారులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 410 కేసులు నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ లేని 378, సీటు బెల్ట్ ధరించని 32 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్పీ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు. హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగర శివారులోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్రాస్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. జమ్మలమడుగు మండల పరిధిలోని కన్నెలూరుకు చెందిన శైలాష్ (46) కడపలోని శంకర్‌రెడ్డి వీధిలో నివాసం ఉంటూ, డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వున్నారు. ఆదివారం మోటార్ సైకిల్‌పై వెళ్తున్న శైలాష్‌ను గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయనను రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి కుమార్తె తబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు



పులివెందుల రూరల్ : పట్టణంలో కదిరికి వెళ్లే రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి రోడ్డులో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయనను వెంటనే స్థానికులు 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ అదుపు తప్పి..

డ్రైవర్‌కు గాయాలు



పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

చెన్నూరు : కడప–తిరుపతి బైపాస్ రోడ్డులోని డీఎస్‌ఆర్ కల్యాణ మండపం వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎర్రగుంట్ల నుంచి కడపకు రాళ్ల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను పొట్టుతో వెళ్తున్న లారీ క్రాస్ చేయబోయింది. పొట్టు బస్తా ట్రాక్టర్‌కి తగిలి.. లారీలోని పొట్టు ట్రాక్టర్ డ్రైవర్ మీద పడింది. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ కుళ్లాయప్పకు గాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు.

మిస్సింగ్ మొబైల్స్.. ట్రేసింగ్ అదుర్స్

- మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) ఏర్పాటు
- జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- సత్ఫలితాలిస్తున్న వైనం



జిల్లా పోలీస్ అధికారులతో అందుకున్న సెల్‌ఫోన్‌లను చూపిస్తున్న బాధితులు (ఫైల్)

కడప అర్బన్ : పోయిన మొబైల్‌ఫోన్‌లను కనిపెట్టేందుకు పోలీసులు ఏర్పాటు చేసిన ఎంఎంటీఎస్ (మొబైల్ మిస్సింగ్ ట్రాకింగ్ సిస్టమ్) సత్ఫలితాలిస్తోంది. దీనిని జిల్లా పోలీసు శాఖ సైబర్ క్రైమ్ టీమ్, ఐటీ కోర్ టీంలు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పర్యవేక్షణలో గతేడాది డిసెంబర్ 1న ప్రజల్లోకి తీసుకుని వచ్చాయి. ఈ నెల 26 వరకు తమ సెల్‌ఫోన్‌లు పోయాయని 1960 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 464 సెల్‌ఫోన్‌ల లొకేషన్ కనిపెట్టారు. ఇప్పటి వరకు 143 రికవరీ చేశారు.

ఫిర్యాదు చేసే విధానం

జిల్లాలో ఎవరైనా సరే తాము సెల్‌ఫోన్‌లను పోగొట్టుకుంటే మొదట వాట్సాప్ నంబరు: 93929 41541కు హాయ్ అంటూ మెసేజ్ చేయాలి. అలా మెసేజ్ చేయగానే లింక్ వస్తుంది. లింక్‌ను టచ్ చేస్తే ఫిర్యాదుకు సంబంధించిన అప్లికేషన్ ఫాం వస్తుంది. మొదట ఫిర్యాది పేరు, చిరునామా, సెల్ కంపెనీ, పోలీస్‌స్టేషన్ పరిధి, ప్రస్తుతం తమ వద్ద ఉపయోగిస్తున్న సెల్ నంబరు, సమాచారం కోసం మరో ఫోన్ నంబరు, సెల్‌ఫోన్ మిస్సింగ్ తేది, ఎలా పోయిందో కారణం, ఐఎంఈఐకి సంబంధించి రెండు నంబర్లు నమోదు చేయాలి. తరువాత తాము పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌కు సంబంధించిన ఇన్‌వాయిస్ (బిల్లులు), తమ గుర్తింపు కార్డు (ఆధార్‌కార్డు)లను ఫొటోలుగా తీసి 'పి.డి.ఎఫ్' ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలి. చివరగా దరఖాస్తుతోపాటు పీడీఎఫ్ వివరాలను సబ్‌మిట్ చేయాలి. సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే తమ ఫోన్ ద్వారానే ఇలా ఫిర్యాదు చేయవచ్చును. ఫిర్యాదు తరువాత సమాచారాన్ని తాము నమోదు చేసుకున్న సెల్‌ఫోన్ నంబర్లలో కడప సైబర్ క్రైమ్ టీమ్ వారు సంప్రదించి బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తారు.

బాధితులకు ఫోన్లు అప్పగింత

ఇటీవల దాదాపు రూ.30 లక్షల విలువైన 130 సెల్‌ఫోన్‌లను బాధితులకు కడపలోని జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, అదనపు ఎస్పీ తుషార్ డూడీ (అడ్మిన్), ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఫ్యాక్షన్‌జోన్ డీఎస్పీ చెంచుబాబు, కడపలోని సైబర్ క్రైమ్ టీమ్ సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్‌ఐలు మధుమల్లేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బంది అందజేశారు.

జిల్లాలో మిస్సింగ్ సెల్‌ఫోన్‌ల రికవరీ వివరాలు

సబ్ డివిజన్ పేరు	వచ్చిన ఫిర్యాదులు	రికవరీ	మిగిలినవి
జమ్మలమడుగు	37	19	18
కడప	122	62	60
మైదుకూరు	47	9	38
ప్రొద్దుటూరు	49	20	29
పులివెందుల	32	17	15
ఇతర జిల్లాలు	110	16	94
ఇతర రాష్ట్రాలు	67	0	67
మొత్తం	464	143	321

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఇచ్చారు



మా గ్రామంలో మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా సెల్‌ఫోన్‌ను గతేడాది డిసెంబర్ 7న పోగొట్టుకున్నాను. రూ.18,500 పెట్టి కొన్న ఫోన్ పోవడంతో ఎంతో బాధ వేసింది. ఇక నాకు దక్కదని అనుకున్నాను. పోలీసులను సంప్రదిస్తే ఫిర్యాదు తీసుకున్నారు. తరువాత వారే ఫోన్ చేసి ట్రేస్ చేశామని జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి ఇప్పించారు. ఎంతో ఆనందంగా వుంది.

– రామ్మోహన్‌రెడ్డి, తప్పెట్ల, వల్లూరు మండలం

ప్రత్యేకంగా ట్రేస్ చేస్తున్నాం



జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నేతృత్వంలో కడప సైబర్ క్రైమ్ టీం, ఐటీ కోర్ టీంల ద్వారా రూపొందించిన మొబైల్ మిస్సింగ్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించి ట్రేస్ చేస్తున్నాం. వాట్సాప్ నంబర్ 93929 41541 ద్వారా సాధ్యమైనంత వరకు బాధితులు ఫిర్యాదు చేయవచ్చును. లేనిపక్షంలో తమ దగ్గరిలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించవచ్చు.

– శ్రీధర్‌నాయుడు, ఇన్‌స్పెక్టర్, సైబర్ క్రైమ్ టీం, కడప

బిల్లులు జాగ్రత్తగా ఉంచుకోవాలి



మొబైల్‌ఫోన్‌ను ఎవరైనా కొనుగోలు చేసేటపుడు బిల్లులను ఇప్పించుకుని తమ వద్దనే భద్రంగా వుంచుకోవాలి. సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్‌లను షాపుల వారు కొనుగోలు చేసేటపుడు బిల్లులు తీసుకోవాలి. వినియోగదారులకు అమ్మినా బిల్లులు ఇవ్వాల్సి వుంటుంది. షాపుల వారు బిల్లులు లేకుండా సెల్‌ఫోన్‌లను కలిగి వుంటే చట్టపరిధిలో చర్యలకు బాధ్యులవుతారు.

– కేకేఎన్ అన్బురాజన్, ఎస్పీ, వైఎస్సార్ జిల్లా

ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీలు

హైర్ బస్సులకు భద్రత కరువు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంతం చోరీలకు నిలయంగా మారింది. రాత్రి సమయంలో నిలిపిన ఆర్టీసీ హైర్ బస్సులకు భద్రత లేకుండా పోతోందని ప్రైవేటు బస్సుల యజమానులు వాపోతున్నారు. ఇటీవల హైర్ బస్సుల్లో దొంగతనాలు జరగడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. బస్సుల్లోని టేపు రికార్డర్లు, ఎల్‌ఈడీ బల్బులు, ఇతర సామాన్లు చోరీకి గురయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు టెండర్లు వేసి బస్సులను తెచ్చి బస్టాండులో పెడితే దొంగతనాలు జరుగుతున్నాయని ప్రైవేటు బస్సు యజమాని దేవదానం పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చోరీలు జరగకుండా ఆర్టీసీ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బస్సుల యజమానులు కోరుతున్నారు.



బస్సులో టేపు రికార్డర్ చోరీకి గురి కావడంతో వైర్లు కనిపిస్తున్న దృశ్యం



బస్సులోని డ్రైవర్ సీటును అపహరించిన దృశ్యం

ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా కడప

రన్నర్‌గా వైజాగ్ జట్టు

ఎర్రగుంట్ల : రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా కడప, రన్నర్‌గా వైజాగ్ జట్లు నిలిచాయి. ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 66వ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం సాయంత్రం వరకు టోర్నమెంట్ జరిగింది. ఫైనల్స్‌లో బాలబాలికల విభాగాల్లో కడప, వైజాగ్ జట్లు పోటీ పడ్డాయి. రెండు విభాగాల్లోనూ కడప జట్లు విజేతగా, వైజాగ్ జట్లు రన్నర్స్‌గా నిలిచాయి. దీంతో టోర్నీ విజేతగా కడప జట్టును ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 520 మంది క్రీడాకారులు, 30 మంది దాకా కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, టోర్నమెంట్ అబ్జర్వర్ ప్రభాకర్, పారిశ్రామికవేత్త టి. పవన్‌కుమార్‌రెడ్డి, పీడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి. శివశంకర్‌రెడ్డి తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ తిరుపాల్‌రెడ్డి, ఫుట్‌బాల్ స్టేట్ సెలక్షన్ కమిటీ మెంబర్ ఉస్సేన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న కడప-వైజాగ్ జట్లు



క్రీడాకారులతో సీఐ, టోర్నమెంట్ నిర్వాహకులు

బహుళ సేవా కేంద్రాలుగా సహకార సంఘాలు



వర్చువల్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సహకార శిక్షణ కేంద్ర డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప

కడప అగ్రికల్చర్ : భారతదేశంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరిపతి సంఘాల(పీఏసీఎస్‌ల)ను బహుళ సేవా కేంద్రాలుగా తీర్చిదిద్దుటకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సహకార మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందని సహకార శిక్షణ కేంద్ర డిప్యూటీ రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ గుర్రప్ప పేర్కొన్నారు. తద్వారా రైతు సభ్యులకు రుణపరపతి సౌకర్యంతో పాటు అన్ని సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆదివారం వైఎస్సార్, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని పీఏసీఎస్ సంఘాల ముఖ్య కార్య నిర్వాహణాధికారులకు ఆయన వర్చువల్ పద్ధతిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పీఏసీఎస్ సంఘాలు చేస్తున్న స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక రుణాలతోపాటు ఎరువుల వ్యాపారం, విత్తనోత్పత్తి కేంద్రాలు, పెట్రోల్ బంకులు, ఎల్‌పీజీ కేంద్రాలు నిర్వహించుకొనుటకు వీలుగా బైలా కల్పిస్తుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడిపరిశ్రమ, గొర్రెలు, మేకలు పెంపకం, చేపల పెంపకం, కోళ్ల పరిశ్రమ, శీతల గిడ్డంగుల, ఆహార ధాన్యాల సేకరణ, పూలతోటలు, తేనెటీగల పెంపకంతోపాటు పట్టు ఉత్పత్తి ప్రోత్సాహాన్ని పీఏసీఎస్‌లు చేయటకు వీలు కలుగుతుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘాలతో కంప్యూటీకరణ, డిజిటలైజేషన్ విధానం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని పీఏసీఎస్ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వాహణ అధికారులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎం గ్రేడ్–2లను ఒకే శాఖ కిందకు తీసుకురావాలి

గ్రామ/వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్



మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జేఎల్‌ఎం గ్రేడ్–2లను ఒకే శాఖ పాలన కిందికి కేటాయించి పని చేయించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామ,వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జేఎల్‌ఎం గ్రేడ్–2లు గ్రామ/వార్డు సచివాలయ, విద్యుత్ అధికారుల మధ్య నలిగిపోతున్నారన్నారు. కింది స్థాయిలో ఎంపీడీఓలు బయోమెట్రిక్‌ను ఆఫీస్ వేళల్లో వేయాలని హుకుం జారీ చేయడమే కాకుండా కొన్ని చోట్ల తాము చెప్పిన పనినే చేయాలని కూడా ఆదేశిస్తున్నారని, లేదంటే షోకాజ్ నోటీసులు ఇస్తామనడం సరికాదన్నారు. ఇలా రెండు శాఖల మధ్య జేఎల్‌ఎం గ్రేడ్–2లు పనిఒత్తిడితో నలిగిపోతున్నారన్నారు. విద్యుత్ సంస్థ సర్వీస్ రూల్స్ ప్రకారం 24 గంటలు పని చేయించుకుంటూ గ్రేడ్–2లు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 100 మందికిపైగా జేఎల్‌ఎం గ్రేడ్–2లు మరణించారని, 200 మందికిపైగా అంగవైకల్యం చెందారన్నారు. రాష్ట్ర కార్యదర్శి మంజునాథ మాట్లాడుతూ జేఎల్‌ఎం గ్రేడ్–2లను విద్యుత్ సంస్థల పర్యవేక్షణలో కాకుండా గ్రామ, వార్డు సచివాలయ పర్యవేక్షణలో పని చేసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే 010 కింద వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సుదీర్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి, శివప్రకాష్‌రెడ్డి, మునెయ్య, రమణరాజు, రెడ్డిరాజు, కృపాకర్, శ్యామ్, మల్లికార్జున, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోలు ఢీకొని వ్యక్తి మృతి

సంబేపల్లె : మండలంలోని శెటిపల్లె సమీపంలో ఆదివారం రెండు ఆటోలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ బుర్రవాండ్లపల్లెకు చెందిన గోపగాని సుబ్బరాయుడు (42) ఇంటి నిర్మాణపు సామగ్రితో బుర్రవాండ్లపల్లె నుంచి ఆటోలో శెట్టిపల్లె కస్పాకు బయలుదేరాడు. శెట్టిపల్లె వైపు నుంచి వస్తున్న మరో ఆటో (నాలుగు చక్రాల వాహనం) ఢీకొంది. ఈ రెండు వాహనాలు శెటిపల్లె సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుబ్బరాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ : భార్యాభర్తలకు గాయాలు

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కారును లారీ ఢీకొనడంతో భార్యాభర్తలు స్వల్ప గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన భార్యాభర్తలు సతీష్, భాగ్యలక్ష్మీ కారులో చెన్నై నుంచి విజయవాడకు వెళ్తుండగా.. మండల పరిధిలో దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

రాష్ట్ర స్థాయి గురుకులం పోటీలు ప్రారంభం



క్రీడాకారుల విన్యాసం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

సింహాచలం(విశాఖపట్టణం) : మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి గురుకుల పాఠశాలల క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్టణం జిల్లాలోని సింహాచలంలో గురుకుల పాఠశాల వేదికగా ఈ పోటీలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లోని బీసీ గురుకుల పాఠశాలల నుంచి 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ముందుగా ఈ పోటీలను ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 102 బీసీ గురుకులాల్లో 35 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. విద్యా విషయాల్లోనే కాకుండా క్రీడల్లో కూడా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. తొలుత జిల్లాల వారీగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఇక్కడ 12 రకాల స్పోర్ట్స్, 8 రకాల గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సింహాచలం గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డి.సత్యారావు, ఆయా పాఠశాలల నుంచి వచ్చిన 60 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, 20 మంది రిఫరీలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విన్యాసాలు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల సందర్భంగా ప్రారంభ వేడుకల్లో ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. వందన సమర్పణను విశేషంగా క్రీడాకారులు నిర్వహించారు.

ఉత్సాహంగా తొలిరోజు పోటీలు

తొలి రోజు జరిగిన 800 మీటర్ల పరుగు పోటీలో బాలుర విభాగంలో బి.ప్రశాంత్(చిత్తూరు), టి.యుగంధర్(శ్రీకాకుళం), వి.మణికంఠ కుమార్(నెల్లూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 800 మీటర్ల బాలికల విభాగంలో బి.శ్రీవాణి(కర్నూల్), బి.హర్షిత(శ్రీకాకుళం), జి.భవ్యశ్రీ(అనంతపురం) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగాయి.